సొమ్ము వస్తదో.. రాదో..?

జమ చేసిన డబ్బులపై వృద్ధ మహిళల ఎదురుచూపు..

- జిల్లాల్లో లబ్ధిపొందనున్న వృద్ధ మహిళలు 15,532 మంది
- ఏడాది క్రితం తిరిగి చెల్లిస్తామని ప్రకటించిన సర్కారు
- గతంలో 60 ఏళ్లు దాటిన వృద్ధ మహిళల కోసం అభయ హస్తం
- ఆర్థిక దన్నుగా నిలిచిన పథకం రద్దుతో నిరాశ

సాక్షి, మేడ్చల్ జిల్లా: గతేడాది పొదుపు సంఘాల మహిళలు జమ చేసిన అభయ హస్తం డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాలోని వృద్ధ మహిళలకు లబ్ధి చేకూరుతుందని ఆనందపడ్డారు. కానీ, ఏడాది గడిచినా.. ఆ సొమ్ము(డబ్బులు) జమ కాకపోవడంతో అభయ హస్తం కింద డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మహిళలు చెల్లించిన డబ్బులు మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సమయంలో హడావుడి చేసిన అధికారులు కూడా ఆ విషయాన్ని మరచిపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొదుపు సంఘాలలోని వృద్ధ మహిళలకు ఆర్థిక దన్నుగా నిలిచిన అభయహస్తం పథకాన్ని కొన్నేళ్ల కిందట రద్దు చేశారు. 2009లో అప్పటి ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద స్వయం సహాయక సంఘాల్లో 60 ఏళ్లలోపు ఉన్న మహిళలు ఏటా కొంత మొత్తం డబ్బులను జమచేస్తే.. వారికి 60 ఏళ్లు దాటిన తర్వాత పంఛన్ అందజేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశంగా ఉండేది.

పథకం అమలు తీరిలా..

స్వయం సహాయ సంఘాలను మొదట 'వెలుగు' పేరుతో ప్రారంభించారు. అందులో అభయహస్తం అనే పథకాన్ని తీసుకొచ్చారు. మహిళలు 60 ఏళ్ల వయసు వరకు ఏటా రూ.365 ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం మరికొంత నగదు జమచేసి ఎల్ఎస్ఐసీ వారికి అందించేది. దీంతో 60 ఏళ్లు దాటిన మహిళలకు ప్రతి నెలా రూ.500 పింఛన్ అందించేవారు. అభయహస్తంలో చేరిన మహిళా కుటుంబ సభ్యుల్లో 9, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ చదివే విద్యార్థులు ఉంటే వారికి సంవత్సరానికి రూ.1200 చొప్పున ఉపకార వేతనాలను ఇద్దరు పిల్లల వరకు చెల్లించేది. అభయహస్తం కడుతూ సహజ మరణం పొందిన వారికి రూ.30 వేలు, ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.70 వేలను అందించేవారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ మొత్తాన్ని రెట్టింపు చేసి అభయ హస్తం పథకాన్ని నిలిపివేసింది. ఇప్పటివరకు డబ్బులు జమ చేసిన మహిళలకు నగదు తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించి ఏడాది గడుసున్నా.. హామీ నెరవేరకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

లబ్ధిదారులు రూ.15 వేలకు పైనే..

జిల్లావ్యాప్తంగా అభయహస్తం పథకంలో 15,532 మంది మహిళలు నమోదై ప్రీమియం డబ్బులను చెల్లించారు. అందులో నుంచి 711 మంది మహిళలకు నెలనెలా పింఛన్లు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం నగదు జమ చేసిన వారికి చెల్లిస్తామని తెలపడంతో గతేడాది సెర్ప్ సిబ్బంది క్షేత్రస్థాయిలో నగదు జమ చేసిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతా, ఆధార్ తదితర వివరాలను సేకరించారు. లబ్ధిదారులు మరణిస్తే వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. దీంతో తాము జమ చేసిన నగదు వస్తుందనే ఆశతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిక అందించాం

జిల్లాలో అభయహస్తం పథకం ద్వారా గతంలో డబ్బులను చెల్లించిన వారి బ్యాంకు ఖాతా, మహిళా సంఘాల వివరాలతోపాటు ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల్లో లేనివారైతే.. గతంలో వారు ఏ సంఘంలో సభ్యులుగా ఉన్నారనే వివరాలను సేకరించి రాష్ట్ర కార్యాలయానికి అందించాం. అక్కడి నుంచి ఆదేశాలు రాగానే సంబంధిత లబ్ధిదారుల ఖాతాలో నగదు జమయ్యే అవకాశం ఉంటుంది.

– పద్మజారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

శామీర్‌పేట్: అలియబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఐసీఐసీఐ 33 కేవీ ఫీడర్, నెక్టార్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా జినోమ్ వ్యాలీలోని ఫార్మా కంపెనీలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

మేడ్చల్‌లో...

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలోని విక్టరీ ఫీడర్ పరిధిలో చెట్ల నరికివేత కారణంగా ఆదివారం పలు పరిశ్రమలకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల సంఘం నూతన కార్యవర్గం

మేడ్చల్: మండల ప్రైవేటు పాఠశాలల సంఘం నూతన కార్యవర్గాన్ని పాఠశాలల యజమానులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గిరిబాబు, ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా వాసుదేవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లవకుమార్‌గౌడ్, కోశాధికారిగా రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా నారాయణమూర్తి, ఉమ, సలహాదారుడిగా హరగోపాల్‌ను ఎన్నుకున్నారు.

ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఘనంగా తీజ్



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తీజ్ పండగను ఏడో రోజు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మూడో వార్డు కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



విద్యార్థులతో పోలీసులు

మేడ్చల్: న్యూ లిటిల్ లిల్లీ పాఠశాలలో పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శిక్షణా కేంద్రం సీఐ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులు తమ చిన్న వయస్సు నుంచే లక్ష్యసాధన దిశగా కష్టపడి, ఇష్టపడి చదివి రాణించాలని అన్నారు. స్కూల్‌లో స్టూడెంట్ కౌన్సిల్‌కు ఎంపికైన విద్యార్థులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐ నర్సింహారెడ్డి యాజమాన్య సభ్యులు మంజుల ప్రకాష్, సాయికిరణ్, సాయిదీప్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

కీసర: కీసరలోని శ్రీషిరిడీ సాయి మద్యం దుకాణంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కీసర సీఐ ఎం.వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం కీసర వెంకటసాయి థియేటర్ సమీపంలోని శ్రీషిరిడీ సాయి మద్యం దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని దుండగులు గడ్డపారతో మద్యం దుకాణం షటర్ ఎత్తి రూ.11 వేలు, రూ.20 వేల ఖరీదు చేసే మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారని తెలిపారు. శనివారం ఉదయం దుకాణ యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

శామీర్‌పేట్: గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ – కరీంనగర్ రాజీవ్ రహదారి శామీర్‌పేట మండల పరిధిలోని ఎవర్‌గ్రీన్ దాబా సమీపంలో రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. శరీర భాగాలు పూర్తిగా నుజ్జునుజ్జవడంతో మృతుడి ఆచూకీ ఆధారాలు లభించలేదని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రాడ్యుయేట్లు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలి

ల్యాండ్ రెవెన్యూ అండ్ రిజిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్



ఏయూ గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడుతున్న నవీన్ మిట్టల్

ఘట్‌కేసర్: గ్రాడ్యుయేట్లు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ అండ్ రిజిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ అన్నారు. శనివారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ప్రోగ్రామ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారం ప్రతిచోటా అందుబాటులో ఉందని, కరోనా ఎక్కడి నుంచైనా విధులు నిర్వర్తించవచ్చని నిరూపించిందన్నారు. విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని, వారు సొంత సంస్థలు స్థాపించడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉద్యోగాల కల్పన 8 శాతం ఉండగా అనురాగ్ యూనివర్సిటీ 25 శాతం వృద్ధి సాధించిందన్నారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాల టాపర్ మానిక, ఫార్మసీ టాపర్ నందినిలను పల్లా రాఘవరెడ్డి స్మారక పురస్కారం, నగదు బహుమతితో సత్కరించారు. కార్యక్రమంలో గౌరవ అతిథి ఈవీపీ, గ్లోబల్ హెడ్, డేటా అనలిటిక్స్, ఏఐ జితేంద్ర చక్రవర్తి, యూనివర్సిటీ చాన్స్‌లర్ యూబీ దేశాయ్, వైస్ చాన్స్‌లర్ రామచంద్రం, రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, సీఈఓ నీలిమా, హెచ్ఓడీలు, తల్లితండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని అడ్డుకున్న బీజేపీ, కాంగ్రెస్ నేతలు



అలియాబాద్‌లో మంత్రిని అడ్డుకున్న పార్టీల నాయకులు

శామీర్‌పేట్: రాష్ట్ర కార్మికశాఖ మంత్రికి నిరసన సెగ తగిలింది. మేడ్చల్ నియోజకవర్గం ఉమ్మడి శామీర్‌పేట మండలంలో మంత్రి మల్లారెడ్డి శనివారం పర్యటించారు. మూడుచింతలపల్లి మండలం, అనంతారం గ్రామంలో పలు పార్టీల నాయకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం అలియాబాద్ గ్రామంలో పర్యటిస్తుండగా గ్రామస్తులు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు మల్లారెడ్డిని అడ్డుకున్నారు. శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయానికి సంబంధించిన భూముల్లో శామీర్‌పేట-అలియాబాద్ గ్రామాల మధ్య ఉన్న రెవెన్యూ సమస్య పరిష్కారం కొరకు చర్యలు తీసుకోవాలని వాగ్వాదానికి దిగారు. అలాగే అలియాబాద్ గ్రామంలో ఏళ్ళుగా ఎదుర్కొంటున్న డ్రైనేజీ కాలువ సమస్యను పరిష్కరించడంలో మంత్రి విఫలమయ్యాడంటూ, మల్లారెడ్డి రెడ్డి డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో మంత్రి అక్కడి నుండి వెనుదిరిగి వెళ్ళిపోయారు.

మెగా కళాశాలలో యాంటీ ర్యాగింగ్ డే



ఘట్‌కేసర్: ఎదులాబాద్ మెగా ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ డేని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఘట్‌కేసర్ సీఐ మహేందర్‌రెడ్డి హాజరై ర్యాగింగ్‌తో కలిగే నష్టాలు, ర్యాగింగ్‌కు గురైన వారి మానసిక వేధన, ర్యాగింగ్‌కు చేసిన వారికి వేసే శిక్షల గురించి వివరించారు. అలాగే సైబర్ స్టాకింగ్, సైబర్ నేరాలపై, యాంటి డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపల్ సాయి వెంకట కృష్ణ, ఎస్సై అశోక్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉన్నవారికి ఉజ్వల భవిష్యత్తు

ఘట్‌కేసర్: పోటీ ప్రపంచంలో ప్రతిభ ఉన్న వారికి ఉజ్వల భవిష్యత్ ఉందని ఇంబ్రిడ్జ్ సొల్యూషన్స్ సీఈఓ చందుపట్ల విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి పాలిటెక్నిక్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియెంటేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత నైపుణ్యం పెంచుకుంటే ఉపాధి అవకాశాలకు కొదవ లేదని, నవ సమాజం నిర్మించడంలో విద్యార్థులు ముందుండాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ చిరంజీవి, సంస్కృతి కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, వైస్ చైర్మన్ చరిత రెడ్డి, కార్యదర్శి మల్లాది రమాకాంత్‌రెడ్డి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ మోహన్, ఫార్మసీ ప్రిన్సిపల్ అరవింద్ రెడ్డి, హెచ్ఓడీలు, విద్యార్థులు, తల్లితండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముఖ్య అతిథి ఇంబ్రిడ్జ్ సొల్యూషన్స్ సీఈఓ చందుపట్ల విక్రమ్‌రెడ్డి

22 కాలనీలు మునుగుతున్నా పట్టదా..?

టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి



నాగారం వరద సమస్యపై జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని సుమారు 22 కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరద, మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలో ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నాగారం మున్సిపల్ వరద బాధిత 22 కాలనీల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ తదితర అఖిలపక్షం నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీల్లో సరైన మురుగునీటి వ్యవస్థ లేదని, దీనికి తోడు జవహర్‌నగర్ డంపింగ్ యార్డు, దమ్మాయిగూడ మున్సిపాలిటీ తదితర ప్రాంతాల నుంచి మురుగు నీరంతా నాగారం మున్సిపల్ పరిధిలోకి వచ్చి చేరుతోందన్నారు. 15 ఏళ్లుగా ఇక్కడి ప్రజలు ప్రతి వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదనీటి కాలువను రాంపల్లి చౌరస్తా ప్రధాన రహదారి మీదుగా పెద్దకప్పు వరకు కేవలం 800 మీటర్ల మేర నాలా పనులు చేపడితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు, కొందరు తమ స్వార్థం కోసం కాలనీల మధ్య నుంచి నాలాను నిర్మించాలని చూస్తున్నారని మండిపడ్డారు. దీనికి మంత్రి మల్లారెడ్డి కూడా మద్దతు తెలపడం ఎంతవరకు సమంజసం అన్నారు. 22 కాలనీవాసుల సముచిత డిమాండ్ మేరకు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాగారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ పంగ హరిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పంగ ముత్యాలు, నేతలు పరమేష్, పంగ సంతోష్, జేఏసీ నేతలు జైకుమార్, బీజేపీ, టీడీపీ, కాలనీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు, రాయితీలు అర్హులైన వికలాంగులకు అందేలా కృషి చేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కురునెల్లి వెంకట్ కోరారు. ఈమేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సంక్షేమ అధికారి(డీడబ్ల్యూఓ)గా కృష్ణారెడ్డికి ఆయన వినతిని అందజేశారు. నూతనంగా డీడబ్ల్యూఓగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కృష్ణారెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో స్వాగతం పలికారు. జిల్లాలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్, టీవీహెచ్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెరుగు శివక్రిష్ణ ఉన్నారు.

ఈద్గా ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న భద్రారెడ్డి తదితరులు

కీసర: గ్రామాల్లో సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మంత్రి మల్లారెడ్డి తనయుడు, సీఎంఆర్‌హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి అన్నారు. శనివారం కీసరదాయర రహదారి సమీపంలోని ముస్లిం ఈద్గా వద్ద ప్రహరీగోడ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఈద్గా చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేసి ముస్లింలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయకపు మాధురి, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదె రమేష్‌గుప్తా, బీఆర్ఎస్ నేతలు, మైనార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

మేడ్చల్‌రూరల్: జాతీయ గ్రంథాలయ అధికారుల దినోత్సవాన్ని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ శంకర్‌గౌడ్, ప్రిన్సిపాల్ నారాయణ, గ్రంథాలయ అధికారులు పాల్గొని గ్రంథకర్త ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం ఏర్పాటు ఆవశ్యతక, కలిగే ప్రయోజనాలు వివరించారు. కళాశాల లైబ్రరీలో 70 వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు లైబ్రేరియన్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇటు హామీలు.. అటు పనులు..



రాజబొల్లారంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలంలోని అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. మంత్రి మల్లారెడ్డి సొంత నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. శుక్రవారం మండలంలోని పూడూర్, మునీరాబాద్, రాజబొల్లారం, రాజబొల్లారం తండా గ్రామ పంచాయతీల పరిధిలో మంత్రి పర్యటించారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు, అండర్ డ్రైనేజీ పనులు తన సొంత నిధులతో చేపడతానని, అసంపూర్తి ఆలయాలు, కులసంఘాల భవనాలను నిధులు కేటాయిస్తానని మంత్రి హామీలు ఇచ్చి గ్రామాలకు వరాలు కురిపించారు. శుక్రవారం హామీ ఇవ్వగా శనివారం ఆయా గ్రామాల్లో వెంటనే సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు మొదలు పెట్టారు. ఆయా గ్రామాల సర్పంచుల పర్యవేక్షణలో పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. గ్రామాల్లో వెంటనే పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి పోసిన ఘటనలో ఇరువురిపై కేసు

జవహర్‌నగర్: యాప్రాల్‌లోని మణి ఎన్‌క్లేవ్‌లో మట్టి పోసిన ఘటనలో ఇరువురిపై జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాలనీలోకి వెళ్లే రోడ్డు మార్గంలో మట్టిపోయడంతో అదే కాలనీకి చెందిన మరికొందరు అడ్డు చెప్పడంతో ఇరువురికి వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాప్రాల్ మణి ఎన్‌క్లేవ్‌లో చోటుచేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం యాప్రాల్‌లోని మణి ఎన్‌క్లేవ్‌లో శుభకార్యం ఉండడంతో మారు అంజయ్య ఇంటి సమీపంలో మట్టి పోయించాడు. దాంతో అదే కాలనీకి చెందిన హరితరెడ్డి రోడ్డుపై పోసిన మట్టితో కాలనీకి వెళ్లాలంటే ఇబ్బందులు ఉన్నాయని జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడకు చేరుకున్న మున్సిపల్ సిబ్బంది మట్టిని తొలగించడంతో మట్టిపోయించిన వారు వీడియో తీయడంతో ఆగ్రహంతో అక్కడకు చేరకున్న స్థానిక నాయకులు సెల్‌ఫోన్ లాక్కొని పగలగొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతులు లేకుండా అటవీ స్థలంలో రోడ్డు



కీసరగుట్ట అటవీ ప్రాంతంలో ఇటాచీతో రోడ్డు పనులు

కీసర: కీసరగుట్ట రహదారిలోని 131 సర్వే నెంబర్‌లో గల ఫారెస్టు భూమి నుంచి కొందరు వ్యక్తులు తమ పట్టా భూముల్లోకి వెళ్లేందుకు ఫారెస్టు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా శనివారం ఉదయం ఇటాచీ వాహనాలతో ఏకంగా అటవీభూమిలోని చెట్లను తొలగిస్తూ రోడ్డు పనులు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇటాచీతో పనులు కొనసాగుతున్నా ఫారెస్టు అధికారులు, బీట్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక అటవీ సిబ్బంది సహకారంతోనే పనులు చేపట్టారా..? అధికారులకు తెలియకుండా పనులు చేశారా అనే విషయం తెలియాల్సి ఉంది. మధ్యాహ్నం తర్వాత అటవీ భూమి నుంచి రోడ్డు పనులు చేపడుతున్న విషయం తెలుసుకున్న మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జలాల్‌పురం సత్తిరెడ్డి, మరికొంత మంది నేతలు జిల్లా కలెక్టరేట్, ఫారెస్టు ఉన్నతాధికారుల దృష్టికి ఫోన్ ద్వారా సమస్యను తీసుకెళ్లడంతో ఎట్టకేలకు శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత ఫారెస్టు సిబ్బంది వచ్చి అటవీభూమిలో నుంచి రోడ్డు పనులు చేపట్టిన ఇటాచీ వాహనాన్ని పట్టుకొని పనులను నిలిపివేయించారు. కాగా అటవీ భూమిలో నుంచి రోడ్డు పనులు చేపట్టిన వ్యక్తులపై చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు డిమాండ్ చేశారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శంకర్‌గౌడ్

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, క్రమశిక్షణతో విద్య అభ్యసించి ఉన్నత స్థానాల్లో నిలవాలని మేడ్చల్ ఎస్ఐ శంకర్‌గౌడ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం పలు జిల్లాల నుంచి ఇంజినీరింగ్ కళాశాలలకు వచ్చే విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పట్టాలు అందుకోవాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కలిగే అనర్థాలు, తీసుకునే చర్యలను వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, ఇతరులను ఇబ్బందులకు గురిచేసినా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ ,డీన్‌లు సౌజన్య, దేవేందర్, విజయశాంతి, రోహిణిరెడ్డి, వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజానికి వాస్తవాలను తెలియజేయాలి

- తప్పుడు వార్తలతో ప్రజల్లో భయం
- నకిలీ విలేకరులపై కఠిన చర్యలు
- జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం

జవహర్‌నగర్: మీడియా ముసుగులో కొందరు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమాజానికి వాస్తవాలను అందజేయాలని, తప్పుడు ప్రసారాలు చేసి ప్రజలను భయాందోళనకు గురిచేస్తే సహించేది లేదన్నారు. అటువంటి వారిని గుర్తించి సెక్షన్ 228 ఎ ప్రకారం నోటీసులు అంజేస్తామన్నారు. ఫోర్త్ ఎస్టేట్ నిజాలను నిర్భయంగా బయటకు తీయగలుగుతుందని, కొందరు రేటింగ్ కోసం అబద్ధపు ప్రచారం చేస్తూ చిన్న విషయాన్ని పెద్దదిగా చూపిస్తూ ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు భరోసా ఇచ్చేందుకు మంచి కథనాలు రాయాలని సూచించారు. వ్యక్తిగత ఘర్షణల్లో సైతం గంజాయి ముఠా అంటూ అవాస్తవాలు రాయడం క్షమించరాని నేరమన్నారు. విలేకరుల ముసుగులో కొందరు నకిలీలు తిరుగుతున్నారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఇద్రీస్ అలీ, అనిల్‌కుమార్‌యాదవ్, అనిల్ కుమార్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సీతారాం